మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం
13 నవంబర్ 2026
పేజీలు : 6
@mvaartanews
www.mivaartanews.com

విలీనం పేరుతో విద్యకు దూరం చేయొద్దు.

- తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో గ్రామీణ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు.
- స్వేరోస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోండ్రు రామచంద్రు, సోంపొంగు శ్యాం సుందర్.

ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



పల్లె బడే పేదింటి బిడ్డకు తొలి దేవాలయం ఊరి బడే నిరుపేద కుటుంబాల ఆశలకు తొలి మెట్టుగా నిలుస్తోంది. అలాంటి గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల ఉనికినే ప్రశ్నార్థకం చేసే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో ప్రభుత్వం తీసుకువస్తున్న పాఠశాలల సమీకరణ విధానం పేద విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోందని, విద్యా ప్రమాణాలను పెంచాలనే లక్ష్యాన్ని ఎవరూ వ్యతిరేకించకపోయినా, ఆ పేరుతో గ్రామాల్లోని పాఠశాలలను మూసివేసి, చిన్నారులను దూర ప్రాంతాలకు పంపించే విధానాన్ని విరమించుకోవాలని స్వేరోస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోండ్రు రామచంద్రు, సోంపొంగు శ్యాం సుందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో స్వేరోస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోండ్రు రామచంద్రు, సోంపొంగు శ్యాం సుందర్ లు మాట్లాడుతూ చిన్నచిన్న ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే సమీకృత ప్రాంగణంలో విద్యాబోధన అందించాలనే ప్రతిపాదన అమలైతే గ్రామీణ ప్రాంతాల్లోని ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్స్, కేజీబీవీ తదితర పాఠశాలల ఉనికికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తండాలు, గూడేలు, మారుమూల గ్రామాల్లో నివసించే పేద కుటుంబాల చిన్నారులు తమ ఊరిలోనే చదువుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయన్నారు.ఐదేళ్లలోపు చిన్నారులు, ప్రాథమిక తరగతుల విద్యార్థులు ప్రతిరోజూ ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరం ప్రయాణించి పాఠశాలలకు వెళ్లాల్సి వస్తే వారి పరిస్థితి ఏమిటి రవాణా సదుపాయాలు సక్రమంగా లేకపోతే, బస్సులు సమయానికి అందుబాటులో లేకపోతే ఆ చిన్నారుల చదువు ప్రశ్నార్థకంగా మారదా అని గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేకపోతే పిల్లలను దూర ప్రాంతాలకు పంపలేని పేద తల్లిదండ్రులు అప్పులు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాల్సిన దుస్థితి ఏర్పడవచ్చన్నారు. ప్రభుత్వం ఇచ్చే హామీలకు చేసే పనులకు పొంతన లేకుండా పోతుందని విమర్శించారు.గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి రావడం వల్ల రవాణా, భద్రత, కుటుంబ ఆర్థిక పరిస్థితులు వారి విద్యకు అడ్డంకులుగా మారే అవకాశముంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలే విద్యకు ప్రధాన ఆధారం. అలాంటి పాఠశాలలను దూర ప్రాంతాలకు తరలిస్తే సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్య మరింత దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సాంఘిక సంక్షేమ గురుకులాలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు ప్రత్యేక సామాజిక లక్ష్యాలతో ఏర్పాటయ్యాయి. పేద, అణగారిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, ప్రత్యేక పర్యవేక్షణ అందిస్తున్నాయని వాటిని అలాగే కొనసాగించాలని కోరారు.గతంలో గురుకుల విద్యా వ్యవస్థలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి అధికారులు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, పర్యవేక్షణ, నాణ్యమైన బోధన కారణంగా వందలాది మంది విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లుగా ఎదిగారని గుర్తుచేస్తున్నారు. అదే తరహాలో ప్రస్తుతం ఉన్న గురుకులాలకు సబ్జెక్టుల వారీగా అర్హత కలిగిన అధ్యాపకులు, అవసరమైన సిబ్బంది, మెరుగైన వసతులు కల్పిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సూచిస్తున్నారు.రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించడం, భూముల సేకరణ, భవనాల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు దీర్ఘకాలం పట్టే అవకాశం ఉందని విమర్శకులు అభిప్రాయ పడుతున్నారన్నారు.కొత్త భవనాల నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చే విధానాల కంటే, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించాలి. సరిపడా బోధనేతర సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ బోధన, ప్రయోగశాలలు, ఆటస్థలాలు వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలి. పాఠశాలల నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, అధికారుల నిరంతర పర్యవేక్షణలో నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని కోరారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, విద్యాశాఖలో అధికారుల మధ్య సమన్వయం పెంచి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో గ్రామీణ విద్యా వ్యవస్థను కేంద్రీకరించే విధానాన్ని పునఃపరిశీలించి, సంబంధిత జీవోను రద్దు చేయాలని కోరారు.ప్రభుత్వం ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోతే ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, స్వేరోస్, ఇతర ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేసి పేద విద్యార్థుల విద్యాహక్కులను కాపాడుకుంటామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో చాపలమడుగు వీరబాబు స్వేరో పాల్గొన్నారు.

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కామ్రేడ్ పెద్ద చంద్రన్న పార్టీ నుంచి ఉప్పరబోయిన రామ్మూర్తి,మల్లూరి సుగుణల ప్రాథమిక సభ్యత్వాన్ని తొలగింపు.

- కందగట్ల సురేందర్ జిల్లాకమిటీకార్యదర్శి.

కొత్తగూడెం నవంబర్12 మీ వార్త ఆర్ సి:



సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వీరమళ్ళ మల్లన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కామ్రేడ్ పెద్ద చంద్రన్న పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి కందగట్ల సురేందర్ పాల్గొని మాట్లాడుతూ ఉప్పరబోయిన రామ్మూర్తి మల్లూరి సుగుణల ఇటీవల 2026 ఆగస్టు16 ఇద్దరు ఆత్మ విమర్శ చేసుకుంటూ వైకె పార్టీ నుంచి మా పార్టీకి లెటర్ పెట్టారు. పార్టీ జిల్లా కమిటీ,మీరు అటు నుంచి ఇటు,ఇటు నుంచి అటు పదే పదే వివిదపార్టీలు మారే పద్ధతి సరైంది కాదని, మందలిస్తూ ముఖ్యంగా మీ పద్ధతులుమార్చుకోవాలని, మీ వ్యక్తిగత పోకడలు మార్చుకోవాలని అదేవిధంగా పార్టీకి తెలియకుండా, మీరు పంచాయతీలు చేయటం కానీ వారి వద్ద నుంచి డబ్బులు తీసుకోవడం గాని, పార్టీ కి తెలియకుండా చందాలకు వెళ్లడం గాని, చేయకూడదని, ప్రతి పని నిర్మాణ పద్ధతిలో చేయాలని, అనేక విషయాలను వారితో చర్చించి,పార్టీ నిర్మాణ పద్ధతులకు పూర్తిగా కట్టుబడి పని చేయాలని వారికి తెలియజేసింది. ఎన్నో సంవత్సరాల నుంచి మేము పార్టీలో పని చేస్తున్నాము చివరిగా మాకు ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. పార్టీ నిర్ణయాలకు క్రమశిక్షణయుతంగా పనిచేస్తామని హామి ఇవ్వడం జరిగింది. మీరు ఇచ్చిన హామీని రెండు నెలల కాలంలోనే తుంగలో తొక్కారు. క్రమశిక్షణను ఉల్లంఘించారు, నిర్మాణ వ్యతిరేక విచ్ఛిన్న కార్యక్రమాలకు, ముఠా పద్ధతులకు వ్యక్తిగత ఆర్థిక వసూళ్లకు పాల్పడ్డారు.
పార్టీ పేరును ప్రతిష్టను అభాసుపాలు చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ఆర్థిక అరాచకత్వానికి తెర లేపారు. పార్టీ ప్రాథమిక సూత్రాలకు మరియు నిబంధన వళికి విరుద్ధంగా వ్యవహరించారు. కావున వీరిని ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తూ, బహిష్కరించడం జరిగింది. అలాగే ఇతర ప్రజా సంఘాల నుండి,కూడా, అన్ని బాధ్యతలు నుండి కూడా తొలగించడం జరిగింది. కాబట్టి ఉప్పరబోయిన రామ్మూర్తి మల్లూరు సుగుణలకు సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీకి, ప్రజాసంఘాలకు ఎలాంటి సంబంధం లేదని,వాళ్ళు చేసే ఆర్థిక అక్రమ వసూళ్లకు కానీ చందాల వసూళ్లకు కానీ ఎలాంటి సంబంధం లేదని తెలియజేస్తున్నాము. వీరికి ఎలాంటి సహాయ సహకారాలు, ఆర్థిక వసూళ్లకు సహకరించవద్దని ప్రజలకు వాణిజ్య వ్యాపార వర్గాలకు విజ్ఞప్తి చేయుచున్నాము. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ నాయకులు వీరమళ్ళ ఉమ, శారు కవిత. అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏ ఐ కె ఎమ్ ఎస్) జిల్లా నాయకులు వీరమళ్ళ రాములు,బెజవాడ సత్యనారాయణ, ప్రగశీల మహిళా సంఘం (పి ఓ డబ్ల్యూ) జిల్లా కమిటీ నాయకురాలు పద్మ, భారత కార్మిక సంఘాల సమైక్య (ఐ ఎఫ్ టీ యు) జిల్లా కమిటీ నాయకులు చిరాపు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులకు సహకరించడం సంతోషకరం.

- విద్య లేనిదే దేశ పురోగతి సాధ్యం కాదు.
- వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం.

చర్ల నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



గుంటూరు కు చెందిన నల్లూరి ఉదయలక్ష్మి కుటుంబం విద్యార్థుల చదువులకు సహకరించడం సంతోషకరమని వనవాసీ కళ్యాణ పరిషత్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ అన్నారు. ఉదయలక్ష్మి భర్త నల్లూరి సుబ్బారావు వర్ధంతి సందర్భంగా వారి కుమారులు బాబ్జి, నాగార్జున లు వనవాసీ కొమరం భీం, శబరి బాలికా విద్యార్థి నిలయంకు 50 కేజీల బియ్యం, విద్యార్థులకు ఒక పూట భోజనం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సూర్యనారాయణ మాట్లాడారు. ఉదయలక్ష్మి కుటుంబం మొదటి నుండి సేవాభావం కలిగి ఉండటం హర్షనీయమని పేర్కొన్నారు. ప్రతి ఏటా కొమరం భీం విద్యార్థి నిలయంకు వితరణ అందిస్తూ మానవత్వం చాటుకుంటున్నారని అన్నారు. నిలయ కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి తమ పిన్నిగారయిన ఉదయలక్ష్మి ద్వారా వితరణలను అందించడం అభినందనీయని ప్రశంసించారు. విద్యార్థులు ఇటువంటి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగి తమనుతాము తీర్చిదిద్దుకోవాలని అన్నారు.



పట్టుదలతో చదివి జీవితంలో స్థిరపడటం ద్వారా తల్లిదండ్రులతో పాటు గురువుల కలలను సాకారం చేయాలని హితవుపలికారు. కార్యక్రమంలో వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, జిల్లా సంఘటనా కార్యదర్శి కోరెం రామారావు, కొమరం భీం నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శబరి బాలికా నిలయ కార్యదర్శి బందా స్వరూప రాణి, సహ కార్యదర్శి బుటారి సుజాత, కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి, సున్నం రాజేష్, ప్రముఖ్ లు సంతోష్, వరలక్ష్మి, ముఖేష్ పాల్గొన్నారు.

చౌక ధరల దుకాణంలో తనిఖీ గత 3 నెలల సన్న బియ్యం స్టాక్‌లో 76.76 క్వింటాళ్ల కొరత, డీలర్‌పై 6ఎ కేసు నమోదు.

- జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్.

ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



సాధారణ తనిఖీలలో భాగంగా, జిల్లాలోని కామేపల్లి మండలం, గరిడేపల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణం నెం. 2223009 ను జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు . తనిఖీ సమయంలో చౌక దుకాణంలోని స్టాక్ రికార్డులను, భౌతికంగా ఉన్న నిల్వలతో సరిపోల్చి చూడగా, గత మూడు నెలల సన్న బియ్యం స్టాక్‌కు సంబంధించి ఉండవలసిన 76.76 క్వింటాళ్ల బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు పౌరసరఫరాల అధికారి తెలిపారు.పేద ప్రజలకు అందవలసిన సన్న బియ్యంను అక్రమంగా అమ్ముకున్న సదరు డీలర్‌పై శాఖపరంగాను, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, లబ్ధిదారులకు అందాల్సిన సరుకులు సక్రమంగా పంపిణీ అయ్యేలా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పౌరసరఫరాల అధికారి తెలిపారు.

పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి.

- టిఆర్ఎస్.డి రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ.
- నిరుద్యోగుల గొంతుకగా నిలుస్తా బూసిరెడ్డి శంకర్ రెడ్డి.

ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



తెలంగాణ రక్షణ సమితి డెమోక్రటిక్ నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూసిరెడ్డి శంకర్ రెడ్డి తెలుగు రాష్ట్రాల రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ గవర్నర్‌గా విశిష్ట సేవలందించారని తెలిపారు. కరోనా సమయంలో వేలాది మందికి రెండు నెలలపాటు నిరంతర అన్నదానం, ఆర్థిక సాయం చేసిన మానవతావాది అని పేర్కొన్నారు. ఎంఎల్‌సి అంటే పదవి కాదు,బాధ్యతగా తమ పార్టీ భావిస్తోందన్నారు. ఎంఎల్‌సి అభ్యర్థి బూసిరెడ్డి శంకర్ రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే నిరుద్యోగుల గొంతుకగా పనిచేస్తానన్నారు. ఉద్యోగుల హక్కులకోసం నిరంతరం పోరాడతామన్నారు. గ్రాడ్యుయేట్ల కోసం ప్రత్యేక కార్యాలయాలు, ప్రతి నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ల ప్రతినిధులకమిటీ, ప్రతి హామీ అవులుపై గ్రాడ్యుయేట్లకు నివేదిక అందిస్తామని అన్నారు. ఉద్యోగం, ఉపాధి, విద్య, ఆర్థికభరోసా తమ పార్టీ ధ్యేయుమని పేర్కొన్నారు. తనను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయుకులు సాధు శంకర్, కొంపెల్లి ప్రదీప్ కుమార్, సాయం పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు.

ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



ఖమ్మం నారాయణ పాఠశాలలో నారాయణ ప్రీమియర్ లీగ్,ఎన్.పి.ఎల్ 2026--27లో భాగంగా బ్రాంచ్ లెవల్ ఈ చాంప్స్ స్పోర్ట్స్ డే వేడుకలను



ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.రాంకీ హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఆర్.ఐ క్రాంతి కుమార్,కో ఆర్డినేటర్ వినోద లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను, అభివృద్ధి చేయడంలో క్రీడలు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని, పాఠశాల ప్రిన్సిపల్ నవీన్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు.చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈ చాంప్స్ టీచర్స్, పీఈటీలు చందు పావని, లైఫ్ స్కిల్స్ ట్రైనర్ నరేష్ పాల్గొన్నారు.

నందు మెలోడీస్ ఈవెంట్ ఈ నెల 14 న నిర్వహించు మెగా సినీ వల్లరి జయప్రదం కై పోస్టర్ ఆవిష్కరణ.

ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



ఈనెల 14న ఖమ్మం నగరం లోని వర్ధక సంఘం భవనంలో ఉదయం 10:00 నుండి రాత్రి పది గంటల వరకు మెగా సిని వల్లరి కార్యక్రమం జరుగును. నందు మెలోడీస్ ఈవెంట్స్ వారు నిర్వహించి మెగా సిని వల్లరి కార్యక్రమశీ లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఖమ్మం భక్త రామదాసు ప్రాంగణంలో పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. మెగా సిని వల్లరి లో ప్రముఖ సినీ,టీవీ, యూట్యూబ్ సింగర్స్ పాల్గొంటారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఈవెంట్ ఆర్గనైజర్ అలవాల నందు, ప్రముఖ సినీ, టీవీ, యూట్యూబ్ సింగర్స్ పమ్మి రవి, ఆకుల గణపతి రాజు, ధావల్ సాహెబ్, మొగిలి వెంకటేశ్వర్లు, స్వరాజ్ కుటుంబరావు, ఫ్లూట్ పాషా, పక్రుద్దీన్, మిమిక్రీ భద్ర, గోవింద గురవయ్య, లక్కీ , విజయ,అజిత తదితరులు పాల్గొన్నారు.



నేడు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన.

ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటిస్తారు. తొలుత ఉదయం 10 గంటలకు తల్లాడలోని జీఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో చేయూత పథకం కింద లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేస్తారు. తర్వాత ఉదయం 11:30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ మేరకు ఎంపీ క్యాంప్ కార్యాలయం ఓ ప్రకటన వెలువడింది.

మహిళా రక్షణ సంఘం చర్ల మండల నూతన కమిటీ నియామకం.

- మండల అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి వెంకటలక్ష్మి, కార్యదర్శిగా కూరపాటి స్వరూప ఎన్నిక.

చర్ల నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:





మహిళల హక్కుల పరిరక్షణ, మహిళా సాధికారత, మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా చర్ల మండల మహిళా రక్షణ సంఘం నూతన కమిటీని నియమించారు. భద్రాచలం డివిజన్ మహిళా రక్షణ సంఘం అధ్యక్షురాలు చిట్టిమల సుజాత ఆధ్వర్యంలో సంఘం అభివృద్ధి, విస్తరణలో భాగంగా చర్ల మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చర్ల మండల కేంద్రానికి చెందిన ఎర్రబెల్లి వెంకటలక్ష్మిని మండల అధ్యక్షురాలిగా, ఆర్. కొత్తగూడెం గ్రామానికి చెందిన కూరపాటి స్వరూపను మండల కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అధ్యక్షురాలు ఎర్రబెల్లి వెంకటలక్ష్మి, కార్యదర్శి కూరపాటి స్వరూప మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన భద్రాచలం డివిజన్ మహిళా రక్షణ సంఘం అధ్యక్షురాలు చిట్టిమల సుజాతకు, సంఘం నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహిళల రక్షణ, హక్కుల సాధన, చట్టాల అమలు, మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, బాధిత మహిళలకు అండగా నిలుస్తామని తెలిపారు. మహిళలకు తమ హక్కులపై అవగాహన కల్పిస్తూ, వారికి న్యాయం జరిగేలా సంఘం తరపున కృషి చేస్తామని పేర్కొన్నారు. సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ చర్ల మండలంలో మహిళా రక్షణ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ మహిళల సంక్షేమం, సాధికారత కోసం ముందుండి పనిచేస్తామని వారు వెల్లడించారు.

టాయిలెట్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి గ్రామ సర్పంచ్.

కారేపల్లి నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



లబ్ధిదారులకు మంజూరైన టాయిలెట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రావోజీ తండా గ్రామ సర్పంచ్ బాలు నాయక్ అన్నారు మండల పరిధిలోని రావోజి తండ గ్రామపంచాయతీలో స్వీపు సర్వేలో భాగంగా పదిమంది లబ్ధిదారులకు మంజూరైన టాయిలెట్లు గురువారం మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. పనులు ప్రారంభించి తొందరగా పూర్తి చేయాలని, ఎస్ బి ఎం గ్రాంట్ కింద క్రింద, నిర్మాణం పూర్తయిన తర్వాత అకౌంట్ లోనే అమౌంట్ జమవుతాయని, త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా తాను కృషి చేస్తానన్నారు. నూతన పంచాయతీ కార్యాలయ నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయని త్వరలోనే ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. పంచాయతీ అభివృద్ధిలో తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, కొండపల్లి అనిల్ కుమార్ ఈసీ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై 60 కిలోమీటర్ల ప్రయాణ భారం మోపొద్దు.

- వెంకటాపురం డిగ్రీ కళాశాలను పరీక్షా కేంద్రంగా కేటాయించాలి: కనగాల చైతన్య.

చర్ల, నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



చర్ల మండలంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భద్రాచలంలో పరీక్షా కేంద్రం కేటాయించడంతో రోజూ సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కనగాల చైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చర్లకు సమీపంలోని వెంకటాపురం డిగ్రీ కళాశాలను పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు చర్లలో వారిని నేరుగా కలిసిన కనగాల చైతన్య, పరీక్షలకు హాజరవుతున్న సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. భద్రాచలం వెళ్లేందుకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడం, రహదారులు అధ్వానంగా ఉండటంతో సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం కష్టంగా మారిందని విద్యార్థులు ఆమెకు వివరించారు. ప్రతిరోజూ దూరప్రాంతాలకు ప్రయాణించాల్సి రావడంతో సమయం వృథా కావడమే కాకుండా ప్రయాణ ఖర్చులతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యపై వెంటనే స్పందించిన కనగాల చైతన్య కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారితో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. విద్యార్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని చర్ల మండల విద్యార్థులకు వెంకటాపురం డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు. విద్యార్థుల చదువులకు, భవిష్యత్తుకు ఇబ్బందులు కలగకుండా విశ్వవిద్యాలయ అధికారులు వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు విద్యార్థులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల కన్నీళ్లు తుడిచిన శీనన్న

- 150 మంది తలసేమియా బాధితులకు "చేయూత"
- మంత్రి పొంగులేటి చొరవతో జిల్లాలో వందలాది మందికి లబ్ధి.
- క్యాంపు కార్యాలయానికి వచ్చి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు.

ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



చిన్నారుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీసుకున్న చొరవకు తలసేమియా బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం వ్యాధితో పోరాడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు చేయూత పింఛన్లు మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ కష్టాన్ని గుర్తించి అండగా నిలిచిన శీనన్నకు ధన్యవాదాలు తెలిపారు. తలసేమియా బాధితుల సమస్యలపై గతంలో ఎంపీగా ఉన్న సమయంలోనే పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్లమెంటులో గళమెత్తారని, ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా జిల్లాలోని బాధితులకు చేయూత పథకం ద్వారా పింఛన్లు అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారని వారు గుర్తుచేసుకున్నారు. ఆయన కృషితో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ పరిధిలోని సుమారు 150 మంది చిన్నారులతో పాటు వివిధ ప్రాంతాల్లోని వందలాది మంది బాధితులకు పింఛన్లు మంజూరు కానుండటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షురాలు పొద్దుటూరి పావని ఆధ్వర్యంలో 20 మందికి పైగా తలసేమియా బాధితులు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డిని కలిసి మంత్రి శీనన్నకు తమ కృతజ్ఞతలు తెలియజేయాలని కోరారు. తమ బాధను అర్థం చేసుకుని ఆర్థికంగా అండగా నిలుస్తున్న మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అనిత, ఉదయభాస్కర్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన తలసేమియా బాధితులు పాల్గొన్నారు.

బోనస్ అడిగితే ఉద్యోగాల నుంచి తొలగింపులా?

- హక్కుల పోరాటంపై శోదా యాజమాన్యం ఉక్కుపాదం!
- మూడో రోజుకు చేరిన ఓబీ కాంట్రాక్టు కార్మికుల నిరసన దీక్ష.
- జేఏసీకి చెందిన నలుగురి కార్మికుల తొలగింపుపై కార్మిక సంఘాల ఆగ్రహం..
- సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకోవాలని డిమాండ్.

కొత్తగూడెం నవంబర్ 12 మీ వార్త ఆర్ సి:



తమ శ్రమకు తగిన ప్రతిఫలం అడిగితే ఉద్యోగాల నుంచి తొలగింపు ప్రకటనలా? కార్మికుల హక్కుల కోసం గొంతెత్తితే వేటు తప్పదా? బోనస్‌తో పాటు చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు కల్పించాలని కోరుతున్న కార్మికులపై శోదా యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వికేసీఎం ఓపెన్‌కాస్ట్‌లో శోదా కంపెనీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఓబీ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన విధుల బహిష్కరణ, నిరసన దీక్ష మూడో రోజుకు చేరుకుంది. ఒకవైపు కార్మికులు దీక్షా శిబిరంలో తమ హక్కుల కోసం పోరాడుతుంటే.. మరోవైపు ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న జేఏసీకి చెందిన నలుగురు కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు యాజమాన్యం నోటీసు బోర్డులో ప్రకటించడం వివాదానికి దారితీసింది. హక్కులు అడిగితే తొలగింపులేనా? వికేసీఎం ఓపెన్‌కాస్ట్‌లో 11 కార్మిక సంఘాలతో ఏర్పడిన జేఏసీ ఆధ్వర్యంలో కార్మికుల ఆందోళన కొనసాగుతోంది. 20 శాతం బోనస్ చెల్లించాలని, ఇతర ఓబీ ప్రైవేటు కంపెనీల్లో అమలు చేస్తున్న విధంగా వేతనాలు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న తరుణంలో జేఏసీ నాయకులపై తొలగింపు ప్రకటన చేయడం ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నమని సంఘాల నాయకులు మండిపడుతున్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన యాజమాన్యం వారిని భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు దిగడం సరికాదని విమర్శిస్తున్నారు. కార్మికుల పది ప్రధాన డిమాండ్లు

కార్మికులకు 20 శాతం బోనస్ చెల్లించడంతో పాటు రోజుకు రూ.950 చొప్పున 26 రోజుల వేతనం ఇవ్వాలని జేఏసీ డిమాండ్ చేస్తోంది. ఆదివారం విధులు నిర్వహించిన వారికి డబుల్ మాస్టర్ చెల్లించాలని, 26 రోజులు పనిచేసిన వారికి వేతనంతో కూడిన రెండు సెలవులు కల్పించాలని కోరుతోంది. ప్రతి నెలా వేతన స్లిప్పులు అందజేయాలని, ఏడో తేదీలోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. బ్లాస్టింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు, ఆదివారం డబుల్ మస్టర్, నైట్ షిఫ్ట్ అలవెన్స్ చెల్లించాలని కోరుతోంది. వీటితో పాటు ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించిన నలుగురిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులందరికీ చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించి పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేస్తోంది. సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకోవాలి దీక్షా శిబిరంలో ఏఐటీయూసీ కాంట్రాక్టు విభాగం కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి జి. వీరస్వామి, ఐఎన్‌టీయూసీ కాంట్రాక్టు విభాగం నాయకులు జెట్టి మోహన్, ఐఎఫ్‌టీయూ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్. సంజీవ్, సీఐటీయూ నాయకులు నాగయ్య, బీఎంఎస్ నాయకులు రఘు, డీడబ్ల్యూఎస్ నాయకులు బాచి, టీబీజీకేఎస్ నాయకులు హైమద్, హెచ్ఎంఎస్ నాయకులు బాజీ, టీయూసీఐ నాయకులు చంద్రశేఖర్, టీఎన్‌టీయూసీ నాయకులు కోటేశ్వరరావు, సీకేహెచ్‌పీఎస్ నాయకులు రామచందర్ మాట్లాడుతూ.. కార్మికులు చేస్తున్నది న్యాయమైన పోరాటమని పేర్కొన్నారు. యాజమాన్యం కక్షపూరిత చర్యలను తక్షణమే నిలిపివేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోదా కంపెనీలో పనిచేస్తున్న కార్మికులపై వేధింపులు ఆపాలని, తొలగింపు ప్రకటనను వెనక్కి తీసుకుని నలుగురు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంలో సింగరేణి యాజమాన్యం తక్షణమే జోక్యం చేసుకుని కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను ఐక్యం చేసి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మార్షల్ శ్రీను భూక్య మోహన్, సతీష్, జి. వెంకటేశ్వరరావు, ఎస్ అశోక్ పి.ఎల్. సురేష్, ప్రమోద్, పాషా, రమేష్, కోటి, జోజి తదితరులు పాల్గొన్నారు.జేఏసీ ప్రధాన డిమాండ్లు తొలగిస్తున్నట్లు ప్రకటించిన నలుగురు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి. 20 శాతం బోనస్ చెల్లించాలి రోజుకు రూ.950 చొప్పున 26 రోజుల వేతనం ఇవ్వాలి ఆదివారం విధులు నిర్వహించిన వారికి డబుల్ మాస్టర్ చెల్లించాలి. 26 రోజుల పని దినాలకు వేతనంతో కూడిన రెండు సెలవులు కల్పించాలి.
ప్రతి నెలా వేతన స్లిప్పులు ఇవ్వాలి. ప్రతి నెలా ఏడో తేదీలోపు వేతనాలు చెల్లించాలి. బ్లాస్టింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు, ఆదివారం డబుల్ మాస్టర్ ఇవ్వాలి నైట్ షిఫ్ట్ అలవెన్స్ చెల్లించాలి. అన్ని చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు, రక్షణ చర్యలు అమలు చేయాలి సోదా క్యాంపులో ఉండే కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించాలి.

సింగరేణి ఉన్నత పాఠశాలలో ఘనంగా చెకుముకి పాఠశాల స్థాయి సైన్స్ సంబరాలు ప్రారంభం.





కొత్తగూడెం నవంబర్ 12 మీ వార్త ఆర్ సి:

మణుగూరు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని కలిగించేందుకునిర్వహిస్తున్న చెకుముకి పాఠశాల స్థాయి సైన్స్ సంబరాలు సింగరేణి ఉన్నత పాఠశాల, మణుగూరులో ఘనంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. భద్రయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ముఖ్య అతిథి డి. భద్రయ్య, ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణి విడుదల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథి డి. భద్రయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని అంశాలను చదవడమే కాకుండా ప్రతి విషయాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. శాస్త్రీయ దృక్పథం, క్రమశిక్షణ, నిరంతర అధ్యయనం, పరిశీలనా శక్తిని పెంపొందించుకుంటూ భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని, దేశ అభివృద్ధిలో విజ్ఞానశాస్త్రం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ ప్రతిభను వెలికితీయడానికి చెకుముకి వంటి సైన్స్ సంబరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడమే కాకుండా, నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను శాస్త్రీయంగా పరిశీలించి పరిష్కారాలను అన్వేషించే అలవాటుపెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని,ఉపాధ్యాయులు దానిని గుర్తించి ప్రోత్సహించాలని తెలిపారు. చిన్నారుల ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ, వారి ఆసక్తిని పెంచుతూ, ప్రయోగాలు మరియు పరిశీలనల ద్వారా నేర్చుకునే అవకాశాలు కల్పించాలని అన్నారు. విద్యార్థులందరూ ఉత్సాహంగా ఈ సంబరాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు.సీనియర్ ఉపాధ్యాయులు ఎం. వేణు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌ను ఒక పాఠ్యాంశంగా మాత్రమే కాకుండా తమ దైనందిన జీవితంలో భాగంగా చూడాలని సూచించారు. ప్రయోగాలు, పరిశీలనలు, అనుభవాల ద్వారా నేర్చుకున్న విజ్ఞానం జీవితాంతం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.మరో సీనియర్ ఉపాధ్యాయులు ఎం. మస్తానయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతనువెలికితీయడానికి సైన్స్ సంబరాలు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదువుతూ నూతన ఆలోచనలను ఆవిష్కరణలుగా మలుచుకోవాలని ఆకాంక్షించారు.జన విజ్ఞాన వేదిక నాయకులు లింగంపల్లి దయానంద్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాల ప్రధాన ఉద్దేశం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, మూఢనమ్మకాల నుంచి దూరంగా ఉంచడం, సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడం అని వివరించారు. చిన్న వయస్సు నుంచే పిల్లల్లో ప్రశ్నించే స్వభావాన్ని ప్రోత్సహించాలని, వారి ఆలోచనలకు స్వేచ్ఛనిస్తూ కొత్త ఆవిష్కరణల వైపు ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక నిరంతరం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు.
మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికైన విద్యార్థులు:పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు మండల స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
8వ తరగతి -- బి. మణిరాం, 9వ తరగతి -- ఏ. సంజయ్,
10వ తరగతి -- జి. పావనశరణ్య.ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు ఆర్.కళ్యాణి,ఉపాధ్యాయులు అభినందించి మండల స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు మమత, రజిత, సరిత, ప్రవంతి, లలిత, రాజసింహ, కళ్యాణ్, షాహిద్, శ్రీదేవి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో సింగరేణి ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలకు విశేష స్పందన లభించింది.

నల్గొండలో జరిగే రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి.

- రైతుల సమస్యలపై జాతీయ స్థాయిలో పోరాటాలకు కార్యాచరణ -- మచ్చా వెంకటేశ్వర్లు.
- బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించిన సీపీఎం నాయకులు.

చర్ల నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:

ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం చర్ల మండల కేంద్రంలో జాతీయ మహాసభల బహిరంగ సభ పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి చారిత్రక నేపథ్యం కలిగిన నల్గొండ గడ్డపై అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలు నిర్వహించడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుందని



అన్నారు. నవంబర్ 15న లక్షలాది మంది రైతులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా నాలుగు వేల మందికి పైగా ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన పోరాటాలకు ఈ మహాసభల్లో కార్యాచరణ రూపొందించనున్నట్లు వివరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా వ్యవసాయ రంగాన్ని విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అనుసరిస్తోందని ఆయన విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం లేదని అన్నారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించడం, రైతుల ప్రయోజనాలను కాపాడటం, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జాతీయ మహాసభల్లో కీలక తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజలు జాతీయ మహాసభలకు మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు చింతూరి వెంకటరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే. బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి మచ్చా రామారావు, మండల కమిటీ సభ్యులు బండెల చంటి, పొడుపుగంటి సమ్మక్క, దొడ్డి హరినాగ వర్మ, బి. నవీన్, వరలక్ష్మి, శ్యామల చంద్రం, కొట్టే నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాద్ -- డిసెంబర్-9.

- లక్ష విల్లంబులతో బరాబర్‌గా హైదరాబాద్ రాజధానికి చేరుకుంటాం.
- ఆదివాసీ హక్కుల సాధన కోసం తుడుం దెబ్బ సమరశంఖం.

చర్ల నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:

డిసెంబర్ 9న హైదరాబాద్ రాజధానిలో ఆదివాసీ హక్కుల సాధన కోసం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ, నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తుడుం దెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ ఆధ్వర్యంలో చర్ల మండల కేంద్రంలోని తుడుం దెబ్బ కార్యాలయం ఎదుట ఆదివాసీ యుద్ధవీరుడు కొమరం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఛలో హైదరాబాద్ డిసెంబర్ 9 కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కాపుల నాగరాజు, తుడుం దెబ్బ సీనియర్ నాయకులు తాటి రామకృష్ణ, చర్ల మండల అధ్యక్షుడు పూనెం రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. అక్రమంగా ఎస్టీ జాబితాలో చేరిన వలస లంబాడీల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9న తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆదివాసీల భారీ బహిరంగ సభకు అనుమతులు ఎలా ఇస్తారంటూ సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడి చేస్తామని లంబాడీ నాయకులు హెచ్చరికలు చేయడం సరికాదన్నారు. ఆదిమ ఆదివాసీ తెగలను కించపరిచే విధంగా, అణచివేసే విధంగా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా డిసెంబర్ 9న లక్షలాది విల్లంబులతో హైదరాబాద్‌కు బరాబర్‌గా చేరుకుంటామని, ఆదివాసీల హక్కుల విషయంలో తాడోపేడో తేల్చుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర





ప్రభుత్వం ఆదివాసీల పక్షాన ఉందా? లేక ఇతరుల పక్షాన ఉందా? అనేది నిజనిర్ధారణ ద్వారా తేలాల్సిన అవసరం ఉందని అన్నారు.

అటవీ అధికారుల దాడులపై ఆగ్రహం.

ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ అధికారుల దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ఐదవ షెడ్యూల్ పరిధిలో ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాల్సిన అధికారులు ఇష్టానుసారంగా ఆదివాసులపై అక్రమ కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టేందుకు తుడుం దెబ్బ నిరంతరం పోరాడుతుందని, ఆదివాసీ జాతికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

గోదావరి జలాలు ఆదివాసీ గూడాలకు అందని దుస్థితి.

గోదావరి నదిపై నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా సుమారు 82.5 లక్షల ఎకరాల మైదాన ప్రాంతాలకు సాగునీరు తరలిస్తూ మూడు పంటలకు నీరు అందిస్తున్నారని, కానీ గోదావరి నది ఒడ్డున ఉన్న ఆదివాసీ గూడాలకు మాత్రం తాగునీరు కూడా అందని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి ఇసుకను లక్షల టన్నుల కొద్దీ తరలించుకుపోతున్నప్పటికీ, ఆదివాసీలు తమ అవసరాల కోసం ఒక ట్రాక్టర్ ఇసుక తీసుకెళ్లాలన్నా అనేక ఆంక్షలు విధిస్తున్నారని మండిపడ్డారు. అలాగే వేలాది మెగావాట్ల విద్యుత్ ఆదివాసీ ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు తరలిపోతున్నప్పటికీ, 79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో నేటికీ అనేక ఆదివాసీ గూడాలకు విద్యుత్, రహదారి సౌకర్యాలు లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

ఆదివాసీలకు ఉద్యోగ నియామకాల్లో న్యాయం చేయాలి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐటీడీఏల ద్వారా ఏజెన్సీ డీఎస్సీ విధానం అమలులో ఉండేదని, ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక అవసరాలకు అనుగుణంగా బదిలీలు, పదోన్నతులు జరిగేవని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూల్ ఆఫ్ రిజర్వేషన్ విధానం కారణంగా ఆదివాసీలకు దక్కాల్సిన ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఐటీడీఏ పరిధిలోని 29 శాఖల్లో ఆదివాసీలకు న్యాయంగా దక్కాల్సిన ఉద్యోగ అవకాశాలను కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు చర్ల మండల అధ్యక్షుడు పూనెం రవికిరణ్, ప్రధాన కార్యదర్శి కోరం భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ కలం శ్రీనివాస్, మండల ఆర్గనైజేషన్ సెక్రటరీ మోడెం సాగర్, సహాయ కార్యదర్శి తాటి శ్రీను, మండల కార్యదర్శి అలెం కిషోర్, పూనెం రాంబాబు, సీతారాములు, సంతోష్, మడప అనిల్, సోషల్ మీడియా ప్రతినిధి ఇరుప అరుణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలుప్రారంభించనున్న వైరా ఎమ్మెల్యే.

- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు.

కారేపల్లి నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:

మండలంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని దీనిలో భాగంగా శుక్రవారం వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు అన్నారు. మండల కేంద్రమైన కారేపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ మండల పరిధిలోనిఅప్పాయిగూడెం జిన్నింగ్ మిల్ నందు, కారేపల్లిసీసీఐ పత్తి కొనుగోలు



కేంద్రం కార్యక్రమం'సమయం శుక్రవారం మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభిస్తారు అన్నారు. అదేవిధంగా కారేపల్లి జూనియర్ కళాశాల ప్రాంగణమునందు మధ్యాహ్నం 1:00 గంటలకుసంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. లబ్ధిదారులకుచేయూత పింఛన్ల మంజూరు పట్టాలునూతన స్మార్ట్ రేషన్ కార్డులుఐటీడీఏ ఏజెన్సీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమాలకు మండల వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ గ్రామ కమిటీ సభ్యులతోపాటు సీనియర్ నాయకులు హాజరుకావాలని కోరారు. మండలంలో గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాలు పూర్తికావస్తున్నాయన్నారు. మండల అభివృద్ధిలో ప్రధానంగా ఎమ్మెల్యే సహకారంతో కోట్లాది రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులు నిరంతరాయంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంత మాజీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య కడియాల సుధాకర్ సర్పంచులు రాందాస్ నాయక్ బాలు నాయక్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

నేలకొండపల్లి నవంబర్ 12 మీ వార్త ఆర్ సి:



దివ్యాంగుల విద్యాభివృద్ధి,శారీరక, మానసిక వికాసానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న భవిత కేంద్రాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఎంపీడీఓ ఎం. యర్రయ్య సూచించారు.ప్రతి ఒక్కరికీ విద్య.వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యర్రయ్య మాట్లాడుతూ.. దివ్యాంగ చిన్నారుల భవిష్యత్తుకు భవిత కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. సాధారణ విద్యతో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వారి సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాబోధన అందించేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయని తెలిపారు. దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, వారు స్వతంత్రంగా జీవించేలా అవసరమైన శిక్షణ, సహకారం అందించడం ఈ కేంద్రాల ప్రధాన ఉద్దేశమని వివరించారు. భవిత కేంద్రంలో దివ్యాంగులకు విద్యాబోధన అందించడంతో పాటు, వారి శారీరక ఆరోగ్యాభివృద్ధికి ఫిజియోథెరపీ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ఉపాధ్యాయులతో పాటు వైద్యాధికారిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత కేంద్రాలకు పంపించి అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి దివ్యాంగులు కేంద్రానికి వచ్చేలా అధికారులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైతే రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పెన్షన్లు అందని దివ్యాంగులను గుర్తించి, వారికి పెన్షన్లు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి. రాంప్రసాద్, మండల విద్యాశాఖాధికారి బి. చలపతిరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గోపగాని రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో బొగ్గు నాణ్యత వారోత్సవాలు.

- బొగ్గు నాణ్యత పరిరక్షణ ప్రతి కార్మికుడి బాధ్యత.
- సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ వెంకట చారి.

సత్తుపల్లి నవంబర్ 12మీ వార్త టౌన్ రిపోర్టర్:



సత్తుపల్లి సింగరేణి సంస్థ నిర్వహిస్తున్న బొగ్గు నాణ్యత వారోత్సవాల్లో భాగంగా సత్తుపల్లి ఏరియాలో నిర్వహించిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వెంకట చారి మాట్లాడుతూ, సింగరేణి సంస్థకు బొగ్గు నాణ్యత ఎంతో ముఖ్యమని, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సంస్థ అభివృద్ధికి, మంచి పేరు ప్రతిష్ఠలకు దోహదపడుతుందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి నుంచి రవాణా వరకు ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, బొగ్గులో రాళ్లు, మట్టి వంటి ఇతర పదార్థాలు కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సరైన శాంప్లింగ్, గ్రేడింగ్ పద్ధతులను పాటించడం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయవచ్చని పేర్కొన్నారు.ఈ వారోత్సవాల ద్వారా కార్మికులు, అధికారులు బొగ్గు నాణ్యతపై మరింత అవగాహనపెంపొందించుకోవాలని, ఉత్పత్తి లక్ష్యాలతో పాటు నాణ్యతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, యాజమాన్యం మరియు కార్మికులు సమన్వయంతో పనిచేస్తూ బొగ్గు నాణ్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, సీఎంఓఏ నాయకులు సునీల్ వర్మ, ఏరియా ఇంజనీర్ సోమశేఖర్, పీఈ శ్రీనివాస్, క్వాలిటీ మేనేజర్ నూకరాజు, జేవీఆర్ ఓసీ ఎస్ఓఎం బెజ్జంకి రాజేశ్వరరావు, కిష్టారం ఓసీ ఎస్ఓఎం బుడిగం రామకృష్ణ, సంతోష్, నవీన్, సంక్షేమ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో భక్త రామదాసు కళాక్షేత్రములు బాలల దినోత్సవం.

నేలకొండపల్లి నవంబర్ 12 మీ వార్త ఆర్ సి:



నేలకొండపల్లి భక్తరామదాసుభక్తరామదాసు సర్వీస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 9 గంటలకు స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో బాలల దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రైవేట్ పాఠశాల లు పిల్లలు ఉత్సాహంగా ఆటలు డిబే ట్ పాటలు వంటి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో సర్వీస్ సొసైటీ అధ్యక్షులు. పచ్చ తిరుపతయ్య సెక్రెటరీ .గేల్లా వెంకట్ రమణ గుప్తా. కోశాధికారి. దండ రవీంద్రబాబు ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ. ఎంఈఓ. బి. చలపతిరావు నేలకొండపల్లి మండల పోలీస్ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పిల్లలకి మత్తుపదార్థాలకి బానిస కాకుండా చూసుకోవాలని తల్లిదండ్రులు చిన్న పిల్లలకి బైకులు ఇయ్యరాదని వేగంగా నడప రాదని నడిపిన వారికి కఠిన చర్యలు తప్పవని తగు సూచనలు తెలియజేశారు వారు చేతుల మీదగా బహుమతులని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కోదూరు వెంకటాచారి, మాజీ అధ్యక్షులు, గేల్ల జగన్మోహన్‌రావు, పాలడుగు పూర్ణచంద్, ఎలమద్ది లెనిన్ పొనగాని, శ్రీనివాస్ ఏటుకూరి వెంకట్ రామారావు, ఈసీ. సభ్యులు ఓరుగంటి నారాయణరావు, దేవరశెట్టి లక్ష్మణరావు, మందడపు వెంకటేశ్వర్లు, బండారుపల్లి నాగేశ్వరరావు, షేక్ ఖాసిం సాహెబ్, ఎర్రసైదయ్య, రేరా నరసింహారెడ్డి, గోళ్ళ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వనమా అలేఖ్య పుట్టినరోజు జరగాలి కొత్తగూడెం ప్రజలకు పండగ రోజు.

కొత్తగూడెం నవంబర్ 12 మీ వార్త ఆర్ సి:



ఇటీవల రాజకీయ అరంగ్రేటం చేసిన కొత్తగూడెం మాజీ శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు వెంకటేశ్వరరావు మనవరాలు టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవ కూతురు డాక్టర్ వనమా. అలేఖ్య పుట్టినరోజు సందర్భముగా ప్రకృతి పర్యావరణ పరిరక్షణ ప్రేమికుడు కే ఎన్ రాజశేఖర్ ఒక అల్ల నేరేడు మొక్కను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సింగరేణి కార్పొరేట్ , ప్రకాశం స్టేడియం ఆవరణలో నాటి శు భాకాంక్షలు తెలియజేశారు. అతను ప్రతి రోజు క్రమం తప్పకుండా మొక్కలు నాటిన ఈ రోజు 2325 వ రోజు డాక్టర్ అలేఖ్య పుట్టినరోజు కావటం అభినందనీయం అంటూ వారు రాజకీయ రంగంలో ప్రవేశించి వారి తాత గారైన వనమా వెంకటేశ్వరరావు వలె ప్రజలకు సేవలు అందించాలని మొక్కల కె. ఎన్ రాజశేఖర్, ప్రధాని మోదీజి మన్ కీ బాత్ - ప్రకృతి ప్రేమికుడు, సింగరేణియన్, తన శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

గరిడేపల్లి చౌక ధరల దుకాణంలో తనిఖీ.

- గత 3 నెలల సన్న బియ్యం స్టాక్‌లో 76.76 క్వింటాళ్ల కొరత.
- డీలర్‌పై 6ఏ కేసు నమోదు.
- జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్.

కామేపల్లి నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



సాధారణ తనిఖీలలో భాగంగా కామేపల్లి మండలం గరిడేపల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణం నెం.2223009 ను జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో చౌక దుకాణంలోని స్టాక్ రికార్డులను, భౌతికంగా ఉన్న నిల్వలతో సరిపోల్చి చూడగా, గత మూడు నెలల సన్న బియ్యం స్టాక్‌కు సంబంధించి ఉండవలసిన 76.76 క్వింటాళ్ల బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు పౌరసరఫరాల అధికారి తెలిపారు. పేద ప్రజలకు అందవలసిన సన్న బియ్యంను అక్రమంగా అమ్ముకున్న సదరు డీలర్‌పై శాఖపరంగాను, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, లబ్ధిదారులకు అందాల్సిన సరుకులు సక్రమంగా పంపిణీ అయ్యేలా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయ ని పౌరసరఫరాల అధికారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిపిఓ బోలేష, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కాంగ్రెస్ వాణిజ్య విభాగ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్.



ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:

హైదరాబాద్ ప్రజాభవన్ లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ లను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కాంగ్రెస్ వాణిజ్య విభాగ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను జిల్లా కాంగ్రెస్ వాణిజ్య విభాగ అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతతో మర్యాదపూర్వకంగా వాణిజ్య విభాగ నాయకులతో కలిసి హైదరాబాద్ ప్రజాభవన్ లో భట్టి విక్రమార్క మల్లు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ లను కలిశామని అన్నారు. జిల్లాలో వాణిజ్య విభాగ నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు రంగా జనార్ధన్, తూములూరి లక్ష్మీనరసింహారావు, ఖాజా మురళి తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా ఏకమై తీన్మార్ మల్లన్న పాదయాత్రను విజయవంతం చేయాలి.

- టీఆర్పీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు దామల సత్యం.
- నవంబర్ 19న ఖమ్మంలో జరిగే పాదయాత్రకు విద్యార్థులకు ఆహ్వానం పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు.



ఖమ్మం నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులను కలిసి, ఈ నెల 19వ తేదీన ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా అధ్యక్షులు దామల సత్యం మాట్లాడుతూ విద్యార్థులు సమాజ మార్పులో కీలక పాత్ర పోషించాలని, విద్యార్థుల హక్కులు, నిరుద్యోగుల సమస్యలు, సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికార సాధన కోసం జరిగే పోరాటాల్లో యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలని అన్నారు. ఈ నెల 19న ఖమ్మంలో జరిగే తీన్మార్ మల్లన్న పాదయాత్రకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.బహుజనుల హక్కుల సాధన, విద్యార్థుల సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం సాగుతున్న ఈ పాదయాత్రలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు దామాల సత్యం, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు పెరమలపల్లి నాగార్జున, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు తేలపుట్ట జగపతి, మేడి పండు విద్యార్థి విభాగం నాయకులు ఆదూరి అజయ్ శ్రీను రాజేష్ వెంకట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

నాగుపల్లి లో పట్టుబడ్డ పేకాట రాయుళ్ళు.

దమ్మపేట నవంబర్ 12 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:

నాగుపల్లి శివారులో రెండు పేకాట శిబిరాలపై దాడి చేయడం జరిగింది. ఒక శిబిరంలో ఒక వ్యక్తి దొరకగా 8 మంది పరారీలో ఉన్నారు రూ 4750 నగదు ఒక బైక్ మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. రెండవ శిబిరంలో ఐదుగురు పట్టుబడగా, ఇద్దరు పారిపోయారు. వారి వద్ద నుండి రూ 2630 నగదు స్వాధీనంతో పాటుగా కేసు నమోదు చేయడం జరిగింది.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి. - విద్యారంగంలో రాణించాలి.

- కామేపల్లి ఎస్సై పి.శ్రీకాంత్.

కామేపల్లి, నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:



విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని, విద్యారంగంలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కామేపల్లి ఎస్సై పి.శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మండల



పరిధిలోని టేకుల తండా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు సపావట్ కిషన్ మనవడు "యువాన్ కైరిన్" మొదటి పుట్టినరోజు సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ చేతుల మీదుగా విద్యార్థులకు స్కేల్, పెన్సిల్ ,పెన్, క్రేన్ ,ఈరేజర్,శార్పనర్ లతో కూడిన రైటింగ్ కిట్టులను పంపిణీ చేయించడం జరిగినది. అనంతరం ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మాటలు విని క్రమశిక్షణతో ఎదగాలని, చక్కగా చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జరపలా రెడ్డి,ఉప సర్పంచ్ లకావత్ నంద, ఎస్ఎంసి చైర్మన్ సపావట్ బుజ్జి, ప్రధానోపాధ్యాయులు టి.వీరన్న,ఆదర్శ ఉపాధ్యాయులు సపావట్ కిషన్,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు వన సమారాధనను విజయవంతం చేయాలి.

- నేలకొండపల్లిలో విస్తృత ప్రచారం.. సంఘ పెద్దలు, నాయకులతో సమన్వయ సమావేశాలు.

నేలకొండపల్లి నవంబర్ 12 మీ వార్త ఆర్ సి:

ఖమ్మం జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న ఖమ్మంలోని మమతా రోడ్డులో ఉన్న చెరుకూరి వారి తోటలో నిర్వహించనున్న వన సమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు.ఈ మేరకు నేలకొండపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన మున్నూరు కాపు సంఘ పెద్దలు, ముఖ్య నాయకులను కలిసి కార్యక్రమ ఏర్పాట్లు, సభ్యుల భాగస్వామ్యం, సమన్వయంపై చర్చించారు.
ఈ సందర్భంగా ప్రతి మున్నూరు కాపు కుటుంబం ఐక్యంగా ముందుకు వచ్చి, కుటుంబ సభ్యులందరితో కలిసి వన సమారాధనకు హాజరుకావాలని నాయకులు



కోరారు. కుల బాంధవ్యాన్ని, ఆత్మీయతను పెంపొందించడంతో పాటు సంఘ ఐక్యతను చాటిచెప్పేలా ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ఖమ్మం జిల్లా గౌరవ సలహాదారులు పసుపులేటి నాసరయ్య, పొదిల రవి,జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపు దేవేందర్,జిల్లా కోశాధికారి మదూరి పూర్ణచంద్రరావు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు డేగల హరిప్రసాద్, తోట శ్రీనివాసరావు, మహిళా జిల్లా కమిటీ సభ్యులు జ్యోతుల జానాబాయి, డేగల మమత, మారిశెట్టి విజయదుర్గ, అడపాల లక్ష్మీకాంత, నేలకొండపల్లి మండల నాయకులు మానుకొండ దుర్గారావు, కందికొండ శ్రీనివాసరావు, బాజా నాగేశ్వరరావు, కందికొండ సత్యనారాయణ, ఏనుగుల శ్రీనివాసరావు, బ్రహ్మారపు ఉదయ్ భాస్కర్, అడపాల వీరబాబు, బాజా శ్రీనివాసరావు, భద్రాజి వెంకటేశ్వరరావు, ముత్యాల వెంకన్న, వాసంశెట్టి వేణు, మంకెనపల్లి రాము, యువజన నాయకులు మర్రి శివ, చిట్టెంశెట్టి ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. మన ఐక్యతే మన బలం..సంఘటిత శక్తే మన గుర్తింపు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఈ వన సమారాధనలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

తిరుమలాపురంలో భూ రీసర్వే ప్రారంభం.

- తొలిరోజు 20 ఎకరాల భూమి సర్వే.. 439 మంది రైతులకు నోటీసులు జారీ.

నేలకొండపల్లి నవంబర్ 12 మీ వార్త ఆర్ సి:

నేలకొండపల్లి మండలంలోని తిరుమలాపురం గ్రామంలో గురువారం భూ రీసర్వే ప్రక్రియ ప్రారంభమైంది. భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి,భూ రికార్డుల్లో ఉన్న వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రభుత్వం చేపట్టిన సర్వేలో భాగంగా అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలో మొదటి విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఇప్పటికే కొంగర, చందాపురం గ్రామాల్లో భూ సర్వే ప్రక్రియ పూర్తికాగా,తాజాగా మూడో గ్రామమైన తిరుమలాపురంలో సర్వే పనులు ప్రారంభించారు.
ఈ సందర్భంగా గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములు,పట్టా భూములు,దేవాలయ భూములను అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తిస్తున్నారు. భూముల యజమానులు,సర్వే నంబర్లు,విస్తీర్ణం తదితర వివరాలను పరిశీలిస్తూ భూముల సరిహద్దులను నిర్ధారించే పనులు



చేపడుతున్నారు. సర్వేయర్ ఆధ్వర్యంలో సాంకేతిక పద్ధతుల ద్వారా భూముల హద్దులను గుర్తించి,ఆయా భూములకు సంబంధించిన వివరాలను నమోదు చేస్తున్నారు. తిరుమలాపురం గ్రామ పరిధిలో మొత్తం 640 ఎకరాల భూమి ఉండగా,265 సర్వే నంబర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.ఈ భూములకు సంబంధించి మొత్తం 439 మంది రైతులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు.రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఇతర భూ రికార్డులను అందుబాటులో ఉంచుకొని సర్వే ప్రక్రియకు సహకరించాలని అధికారులు సూచించారు.
తొలిరోజు సుమారు 20 ఎకరాల భూమిని సర్వే చేశారు.మిగిలిన భూములకు సంబంధించి కూడా నిర్ణీత ప్రణాళిక ప్రకారం సర్వే కొనసాగించనున్నారు. భూ రీసర్వే ద్వారా భూముల విస్తీర్ణం, సరిహద్దుల విషయంలో స్పష్టత రావడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు ఆస్కారం తగ్గుతుందని భావిస్తున్నారు.
ముఖ్యంగా ఒకే భూమికి సంబంధించి హద్దుల విషయంలో రైతుల మధ్య తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని స్థానికుల అభిప్రాయ పడుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కమదన ప్రవీణ్, సర్వేయర్ ఉమామహేశ్వరరావు, జీపీవోలు జానిమియా, రామకృష్ణ,శ్రీను, అశోక్‌తో పాటు స్థానిక రైతులు ఏటుకూరి రామారావు, చెరువు నరసింహారావు, ప్రకాష్ రావు, పేరాల అనిల్ రావు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో జరిగే అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి.

- సత్తుపల్లిలో రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ.

సత్తుపల్లి నవంబర్ 12 మీ వార్త ఆర్ సి:

సత్తుపల్లిఈ నెల 15వ తేదీన నల్లగొండ పట్టణంలో జరగనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏ ఐ కేస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సత్తుపల్లి పట్టణంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ మాచర్ల భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, రైతుల రుణ విమోచన వంటి డిమాండ్ల సాధన కోసం రైతాంగం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.





నల్లగొండలో జరిగే 36వ జాతీయ మహాసభల్లో రైతాంగ సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మోటార్ సైకిల్ ర్యాలీలో తెలంగాణ రైతు సంఘం నాయకులు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, తెలంగాణ రైతు సంఘం డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు, సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలిక పోగు సర్వేశ్వరరావు, సత్తుపల్లి రూరల్ మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, రైతు సంఘం మండల అధ్యక్షులు మొరంపూడి వెంకటరావు, పార్టీ నాయకులు చావ రమేష్, భాష, భాస్కర్, కొవ్వారపు లక్ష్మణరావు, తడకమళ్ళ రామకృష్ణ, బండి వేలాద్రి, పంతంగి నాగరాజు, కొప్పుల స్వామి, చెరుకూరి శ్రీనివాస్, శివాజీ, బలగానిశ్రీను, సీతయ్య, బాణావత్ రవి, కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే పురంలో రూ.39 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి.

- సిమెంట్ రోడ్ల నిర్మాణంలో రామకృష్ణాపురం ఆదర్శం.
- గ్రామ సీమల సమగ్ర అభివృద్ధియే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం.

కామేపల్లి నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:

కామేపల్లి మండలం రామకృష్ణాపురం పంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.39 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి గురువారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ అజ్మీర ద్వాలి చిన్న, ఉప సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, ఎంపీడీవో ధరావత్ సోంలాల్, పి ఆర్ డి ఈ కే.కరుణాకర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, పి ఆర్ ఏ ఈ వేములపల్లి కేశవులు తో కలసి సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిమెంట్ రోడ్ల నిర్మాణంలో రామకృష్ణాపురం పంచాయతీ ఆదర్శంగా నిలిచింది అన్నారు. గ్రామ సీమల సమగ్ర అభివృద్ధియే ప్రజా పాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. ఆర్కే పురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో
నివసించే ప్రజలు ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే వాటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కెవి శ్రీనివాసరావు,ఆత్మ డైరెక్టర్లు అజ్మీర చిన్ని, దమ్మాలపాటి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గుగులోత్ గబ్రు నాయక్, మాలోత్ బావ్ సింగ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్ల పూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గింజల నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి షేక్ ఫత్తే మహమ్మద్, జిల్లా నాయకులు తోటకూరి శివయ్య, ఆరెం రవి, కామేపల్లి సర్పంచ్ అజ్మీర బుల్లి హరి, ఉపసర్పంచ్ అజ్మీర నాగమణి, ఆర్కె పురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సూదనపు కోటయ్య, కామేపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు భూక్య సీతారాములు, మాజీ ఎంపీటీసీలు దొడ్డిగర్ల సుందరం, నల్లమోతు లక్ష్మయ్య, నల్లమోతు వెంకట నరసయ్య, మాజీ ఉపసర్పంచ్ రాయల లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ అజ్మీర రామదాసు నాయక్, సొసైటీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హనుమంతరావు,
ఎల్లమద్ది నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి నాగేంద్రబాబు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, ప్రముఖ కాంట్రాక్టర్ రామళ్ల రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.తొలుత ఎమ్మెల్యే కోరం కనకయ్య, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డికి స్థానికులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. సూదనపు కోటయ్య సారధ్యంలో వారిపై పూల వర్షం కురిపించారు.





అనంతరం ఎమ్మెల్యే కనకయ్య, గోపాల్ రెడ్డి ఇటీవల రామకృష్ణాపురం లో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సూదనపు కోటయ్య, తండ్రి సూదనపు భద్రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భద్రయ్య మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.

ప్రజా పాలన ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్.

- పెన్షన్ మంజూరు పత్రాలు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో.
- ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి.

కామేపల్లి నవంబర్ 12 మీ వార్త ప్రతినిధి:

ప్రజా పాలన ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ చేయూత పెన్షన్ అందించి ఆదుకోవడం జరుగుతుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, సొసైటీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హనుమంతరావు అన్నారు.

కామేపల్లి రైతు వేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారుల కు పెన్షన్ మంజూరు పత్రాలను, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. 602 మంది నూతన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను, 92 మంది లబ్ధిదారులకు 25 లక్షల రూపాయల పైచిలుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అతి కొద్దిరోజులునే ఆరు గ్యారంటీలలో ఒకటేనా మహిళలకు ఉచితంగా ఫ్రీ బస్ సౌకర్యం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ది అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారం లోకి వస్తే అమలు చేస్తామని ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని ప్రజల్లో ఒక అపోహ ఉన్నదని కానీ మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి ఖాళీ ఖజానాను గత ముఖ్యమంత్రి కేసీఆర్ మనకు అప్పజెప్పారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం





ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కూడా సంక్షేమ పథకాల ఆగకూడదని ప్రజా అవసరాలే ధ్యేయంగా ప్రతిక్షణం ప్రతి రూపాయి కూడా ప్రజల కోసం వెచ్చిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం మన తెలంగాణ ప్రజా ప్రభుత్వం అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం అన్నారు. ఆర్థికంగా ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కూడా పేద ప్రజలు వైద్యం కోసం ఖర్చు చేసిన మొత్తంలో ఎంతో కొంత ఇచ్చి వారికి చేదోడు వాదోడుగా నిలవాలని రేవంత్ రెడ్డి సంకల్పం ప్రకారం తుచా తప్పకుండా అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్నాం అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కేసీఆర్ కులాల పేరిట మతాల పేరిట విభజించి లోన్లు ఇస్తానని చెప్పి ప్రజలను మోసం చేసిన ఘనత వారిది అన్నారు. 6 గ్యారంటీల్లో లేనప్పటికీ కూడా ఒంటరి మహిళలకు,వితంతువులకు వికలాంగులకు,గీత కార్మికులకు ఫెంచన్ ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా 4లక్షల 50వేల మందికి పింఛన్లు మంజూరు చేసి పంపిణీ చేస్తున్నాం ఇది ప్రజా ప్రభుత్వం ఘనత అన్నారు. ప్రజలందరు మంచి చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధరావత్ సోంలాల్, తాసిల్దార్ కె వి శ్రీనివాసరావు, ఎం పి ఓ వివిఎస్ శాస్త్రి, మండల ప్రజా పరిషత్ సూపరిండెంట్ తన్నీరు నరేందర్, ఏవో బి.తారా దేవి, కామేపల్లి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, సర్పంచ్ లు అజ్మీర బుల్లి హరి నాయక్,ఆరేం అచ్చమ్మ, గుగులోత్ రమాదేవి, ఉపసర్పంచ్ అజ్మీర నాగమణి, జిల్లా కాంగ్రెస్ కమిటి ప్రధాన కార్యదర్శి గింజల నరసింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి షేక్ పత్తే మహ్మద్ ,జిల్లా నాయకులు తోటకూరి శివయ్య, ఆరేం రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జి.గబ్రూ, ఎం. బావుసింగ్, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు.

- అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచిన భద్రాచలం పోలీసులు.

భద్రాచలం నవంబర్ 12 మన మీ వార్త:

గురువారం భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ బి. రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం టౌన్ పోలీస్ వారు భద్రాచలం కరకట్ట ఏరియాలో పోలీస్ వారు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, గోదావరి కరకట్ట దిగువన, రెడ్డి సత్రం కు సమీపించే క్రమంలో కొన్ని చెట్ల పొదల క్రింద ఉదయం సుమారు 09:15 గం.ల సమయంలో ఇద్దరు మగ వ్యక్తులు పోలీస్ వారిని చూసి కంగారు పడుచూ, పారిపోతున్న క్రమంలో, పోలీస్ వారికి సదరు ఇద్దరు వ్యక్తులపై అనుమానం వచ్చి, కొంత దూరం వెంబడించి, అట్టి ఇద్దరి వ్యక్తులను పట్టుకొని, వారు గంజాయిని త్రాగినారనే అనుమానంతో, పోలీస్ వారి వద్ద ఉన్న గంజాయి టెస్టింగ్ కిట్స్ తో



వారికి పరీక్షలు నిర్వహించగా, అట్టి ఇద్దరి వ్యక్తులకు గంజాయి పాజిటివ్ గా నిర్ధారణ అయ్యింది. తదుపరి అట్టి ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారిని అరెస్ట్ చేసి, భద్రాచలం మేజిస్ట్రేట్ గారి ముందు హాజరు పరచగా, మేజిస్ట్రేట్ గారు అట్టి ఇద్దరు యువకులను డి-అడిక్షన్ సెంటర్ కు పంపించడం జరిగింది.

అదేవిధంగా, ఎవరైనా వ్యక్తులు గంజాయి సేవిస్తున్న లేదా గంజాయి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలుపుతున్నాము. అలాగే గంజాయి గురించిన సమాచారం తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు పోలీస్ వారి విజ్ఞప్తి. అదే విదంగా గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు వినియోగంపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగుతుందని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, భవిష్యత్తుపై దృష్టి సారించాలని మెరుగైన సమాజం కోసం తోడ్పడాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. రాజు తెలిపినారు.

రైతు మహాసభలకు దండిగా కదలండి...

- సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి.
- రైతు మహాసభల ప్రచారంతో హోరెత్తుతున్న భద్రాద్రి.
- మహాసభల విజయవంతం కాంక్షిస్తూ టూకే రన్.

భద్రాచలం నవంబర్ 12 మన మీ వార్త:

దేశానికి వెన్నుముక్క అయినటువంటి రైతు సమస్యల పరిష్కారం కోసం జరిగే అఖిలభారత రైతు మహాసభలకు దండిగా కదలి రావాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రైతు మహాసభల విజయవంతం కాంక్షిస్తూ సిపిఐఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో టూ కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఎం బి నర్సారెడ్డి మాట్లాడారు. ఈనెల 15 16 17 తేదీలలో జరిగే అఖిలభారత రైతు మహాసభల ప్రచారం పట్టణంలో వీధి వీధినా ఉత్సాహంగా పండగ వాతావరణం లో నిర్వహిస్తున్నామని అన్నారు. రైతు మహాసభల సందర్భంగా నిర్వహించే రైతు గర్జన బహిరంగ సభకు భద్రాచలం పట్టణం నుండి 500 మంది వెళ్ళనున్నారని అన్నారు. కేంద్రంలో మోడీ అధికారం చేపట్టిన నాటి నుండి రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. మోడి తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధాని వేదికగా రైతులు సాగించిన పోరాటం ప్రపంచానికే



స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. నాడు రైతులు చేసిన పోరాట స్ఫూర్తితోనే నేడు జెన్ జీ లు ఉద్యమాలు నిర్వహిస్తున్నారని నర్సారెడ్డి స్పష్టం చేశారు. ఎలినినో ప్రభావం ఒకవైపు అకాల తుఫానులు మరోవైపు రైతులను నిలువునా ముచుతున్నాయని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎలినినో ప్రభావంతో సాగునీరు లేక చేతికి అందిన పంటలు ఎండిపోతున్న పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది ఎకరాల పంట ధ్వంసం అయిపోయిందని వెంటనే రైతులకు తక్షణ సహాయం కింద ఎకరానికే 5000 రూపాయలు నష్టపరిహారాన్ని అందివ్వాలని నర్సారెడ్డి డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం నల్లగొండలో జరిగే రైతు మహాసభలలో విస్తృత చర్చలు జరగనున్నాయని అన్నారు. భవిష్యత్తులో రైతు సమస్య పరిష్కారం కోసం పోరాటాలను ఈ మహాసభలో రూపొందించనున్నారని నర్సారెడ్డి స్పష్టం చేశారు. రైతు సంక్షేమాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ అఖిలభారత రైతు మహాసభల విజయవంతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ ట్యూకె రన్లో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట్ రామారావు 20వ వార్డు సభ్యురాలు ఇర్ఫా అనసూయ సీనియర్ నాయకులు బి బి జి పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి కోరాడ శ్రీనివాస్ ఎస్ అజయ్ కుమార్, ఏ రత్నం, చుక్క మాధవరావు కోరాడ శ్రీనివాస్, డి.కనక శ్రీ శాఖ కార్యదర్శి ఎర్రంశెట్టి పూర్ణిమ, పుణ్యవతి, నాగలక్ష్మి సుబ్బలక్ష్మి, జి.లక్ష్మణ్, రాయల రాములు, కాకా రమణ తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ లో రిటైర్మెంట్...



విజయవాడ : ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి, అడిషనల్ డీజీపీ ఎన్. సంజయ్‌కు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన సస్పెన్షన్‌ను మరోసారి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన వయోపరిమితి ప్రకారం పదవీ విరమణ పొందే 2027 మార్చి 31వ తేదీ వరకు లేదా ఆయనపై ఉన్న క్రిమినల్ విచారణ పూర్తయ్యే వరకు ఏది ముందైతే అది సస్పెన్షన్ వేటు కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ అధికారిక జీవో జారీ చేశారు.గత ప్రభుత్వ హయాంలో ఏపీ సీఐడీ అడిషనల్ డీజీపీగా, అలాగే విపత్తు నిర్వహణ-అగ్నిమాపక సేవల శాఖ డీజీగా పనిచేసిన సమయంలో సంజయ్ భారీగా నిధుల మళ్లింపునకు పాల్పడ్డారని అభియోగాలు నమోదు అయ్యాయి. అగ్ని వెబ్ పోర్టల్ నిర్వహణకు కేటాయించిన ప్రభుత్వ నిధులను పక్కదోవ పట్టించడంతో పాటు, సీఐడీ చీఫ్‌గా ఎస్సీ, ఎస్టీ చట్టంపై పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు కేటాయించిన నిధుల్లో రూ. 1.15 కోట్లు దుర్వినియోగం చేశారనే ప్రాథమిక ఆధారాలు లభించాయి. దీంతో ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్-1969 కింద ప్రభుత్వం ఆయనపై 2024 డిసెంబర్ 3న తొలిసారి సస్పెన్షన్ విధించింది.విజయవాడ ఏసీబీ 2024 డిసెంబర్ 24న సంజయ్‌పై అవినీతి నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణను వేగవంతం చేసింది. దీనికితోడు సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్ విశ్వజిత్ నేతృత్వంలో ఆయనపై రెగ్యులర్ శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతోంది. కీలక సాక్షుల విచారణ కొనసాగుతుండటం, ఫొరెన్సిక్ ల్యాబ్ నివేదికలు ఇంకా రావాల్సి ఉండటంతో సమీక్షా కమిటీ సమావేశమై సస్పెన్షన్‌ను కొనసాగించాలని సిఫార్సు చేసింది.హోదా రీత్యా సీనియర్ ఐపీఎస్ అధికారి కావడంతో, ఒకవేళ సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకుంటే సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, ఆధారాలను తారుమారు చేసే అవకాశం ఉందన్న ఏసీబీ డీజీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో విచారణలన్నీ పూర్తికాకుండా సర్వీసులోకి వచ్చే అవకాశం లేకపోవడంతో ఆయన రిటైర్మెంట్ కూడా సస్పెన్షన్ కాలంలోనే ముగియనుంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీ నగరాల హవా..

విశాఖకు అగ్రతాంబూలం

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26' వార్షిక సర్వేలో ఆంధ్రప్రదేశ్ నగరాలు ఘన విజయం సాధించాయి. దేశవ్యాప్త స్వచ్ఛతా ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు నగరాలు జాతీయ స్థాయిలో పురస్కారాలను కైవసం చేసుకున్నాయి. ఓవరాల్ విభాగంలో విజయవాడ దేశంలోనే మూడో అత్యంత స్వచ్ఛమైన నగరంగా నిలిచింది. న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులను అందజేశారు. వివిధ జనాభా వర్గాల వారీగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లోనూ ఏపీ నగరాలు ముందంజలో నిలిచాయి. 10 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని అగ్రగామిగా నిలిచింది. ఈ విభాగంలో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో మూడో స్థానంలో నిలిచాయి. అలాగే 3 లక్షల నుంచి 10 లక్షల లోపు జనాభా ఉన్న నగరాల కేటగిరీలో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ కేటగిరీలో ఉజ్జయిని మొదటి స్థానం, చండీగఢ్ రెండో స్థానం సాధించాయి. ఓవరాల్ ర్యాంకింగ్స్ పరిశీలిస్తే.. మహారాష్ట్రకు చెందిన నవీ ముంబై దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా మొదటి స్థానాన్ని దక్కించుకుంది. గుజరాత్‌కు చెందిన సూరత్ రెండో స్థానంలో నిలవగా, విజయవాడ మూడో స్థానాన్ని సొంతం చేసుకుంది. గత ఎనిమిదేళ్లుగా స్వచ్ఛ నగరాల ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలుస్తూ వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఇండోర్ నగరం ఈసారి టాప్ స్థానాల్లో చోటు దక్కించుకోలేకపోవడం గమనార్హం. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 10వ ఎడిషన్ (సూపర్ స్వచ్ఛ లీగ్)లో భాగంగా దేశవ్యాప్తంగా సుమారు 4,751 నగరాల్లో ఈ సర్వే చేపట్టారు. గత ఏడాది సూపర్ స్వచ్ఛ లీగ్‌లో ఇండోర్ మొదటి స్థానంలో, సూరత్ రెండో స్థానంలో, నవీ ముంబై మూడో స్థానంలో నిలిచాయి. ఇతర విభాగాల ఫలితాలు చూస్తే.. రివర్‌ఫ్రంట్ నగరాల విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన రేవా మొదటి స్థానంలో, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిలాస్‌పూర్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారణాసి మూడో స్థానంలో నిలిచాయి. తీరప్రాంత పట్టణాల కేటగిరీలో ఒడిశాకు చెందిన పూరీ అగ్రస్థానంలో నిలవగా, కేరళకు చెందిన అలప్పుళ రెండో స్థానం, మహారాష్ట్రకు చెందిన రత్నగిరి మూడో స్థానం పొందాయి. హిమాలయ ప్రాంత నగరాల విభాగంలో ఉత్తరాఖండ్‌కు చెందిన రుద్రపూర్ ప్రథమ స్థానాన్ని, జమ్ము ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. దేశవ్యాప్త పోటీలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలు అగ్రశ్రేణిలో నిలిచి రాష్ట్ర ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో మరింత పెంచాయి.

మేధో సంపత్తి వివాదాలకు

ఆ హైకోర్టే శరణ్యం అనుకోవడం భ్రమ..

తమకు అనుకూలమైన న్యాయస్థానాలను ఎంచుకుంటూ పిటిషన్లు దాఖలు చేసే 'ఫోరమ్ షాపింగ్' (లేదా లిటిగేషన్ టూరిజం) ధోరణిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సాంకేతిక పరిధి ఉందన్న ఏకైక కారణంతో సుదూర ప్రాంతాల్లోని హైకోర్టులను ఆశ్రయించడం సరైంది కాదని స్పష్టం చేసింది. మేధో సంపత్తి హక్కుల (ఐపీ) వివాదానికి సంబంధించి ఢిల్లీ హైకోర్టులో నడుస్తున్న ఒక వాణిజ్య దావాను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి బెంగళూరు రూరల్ జిల్లా నెలమంగళకు చెందిన 'మెసర్స్ శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఆగ్రో ఫుడ్స్', ఇతర సంస్థలు వాది (ప్లైంటిఫ్) పక్షంగా ఢిల్లీ హైకోర్టులో వాణిజ్య దావా ఖిజూ(జూవీవీ) 625/2026ని వేశాయి. చెన్నైకి చెందిన 'సాయి మహాలక్ష్మి ట్రేడర్స్' సహా మరికొందరు ప్రతివాదులుగా ఉన్నారు. అయితే, ఇరు పక్షాలు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుకు చెందినవే అయినప్పుడు కేసును ఢిల్లీలో ఎందుకు దాఖలు చేశారో తమకు అర్థం కావడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేసును చెన్నైకి బదిలీ చేయాలంటూ ప్రతివాదులు దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. వివిధ కోర్టులకు ప్రాదేశిక అధికార పరిధి ఉన్నంత మాత్రాన, పిటిషనర్లు తమకు నచ్చిన న్యాయస్థానాన్ని ఎంచుకునే 'ఫోరమ్ షాపింగ్' విధానాన్ని సమర్థించుకోలేరని తేల్చిచెప్పింది. ఇలాంటి చర్యలు దేశంలోని హైకోర్టుల మధ్య అంతరాలు ఉన్నాయనే తప్పుడు భావనను పెంచుతాయని వ్యాఖ్యానించింది. ముఖ్యంగా మేధో సంపత్తి, వాణిజ్య వివాదాలను విచారించడానికి ఒక నిర్దిష్ట హైకోర్టు (ఢిల్లీ హైకోర్టు వంటివి) మాత్రమే అత్యుత్తమమైనదనే ఆలోచన పూర్తిగా తప్పు అని, అది తప్పుడు అవగాహనతో కూడుకున్నదని స్పష్టం చేసింది. వివాదం ఎక్కడైతే మొదలైందో, ఇరు పక్షాలు ఎక్కడైతే ఉన్నాయో ఆ ప్రాంతంలోని న్యాయస్థానాలే కేసులోని వాస్తవాలను సమగ్రంగా అర్థం చేసుకోగలవని కోర్టు అభిప్రాయపడింది. మద్రాస్ హైకోర్టుకు స్వయంగా సివిల్ విచారణ చేపట్టే ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ క్రమంలోనే సదరు కేసును తక్షణమే మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఇరు పక్షాల ప్రతినిధులు కోర్టుకు నేరుగా గానీ లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గానీ హాజరు కావచ్చని తెలిపింది. వాణిజ్య వివాదాల్లో ఢిల్లీ హైకోర్టును మాత్రమే ప్రాధాన్య వేదికగా భావించి ఇతర రాష్ట్రాల వారు సైతం అక్కడికే వెళ్లే పోకడలపై గతంలో ఢిల్లీ హైకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో, సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

రామమందిర విరాళాల లెక్కలు బయటపెట్టాలి..

న్యూఢిల్లీ: అయోధ్య రామమందిర విరాళాల వ్యవహారం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఆలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. విరాళాల సేకరణ, లెక్కింపు, బ్యాంకు ఖాతాల్లో జమ చేసే ప్రక్రియతో పాటు ఆలయ నిర్మాణ పనుల్లోనూ అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), బీజేపీ, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)కు చెందిన వ్యక్తుల పాత్రపైనా దర్యాప్తు జరగాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు.

ముందే ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదా?

2021లోనే ఆలయ విరాళాల లెక్కల్లో అవకతవకలు జరుగుతున్నాయని అప్పటి ఖాతాల అధికారి మహిపాల్ సింగ్ గుర్తించి, ట్రస్టు ప్రతినిధులు చంపత్ రాయ్, గోపాల్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు మీడియా కథనాలు వెల్లడించాయని జైరాం రమేశ్ పేర్కొన్నారు. అయితే అక్రమాలను ప్రశ్నించిన అధికారినే విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఇంజినీర్ దినానాథ్ వర్మ కూడా ట్రస్టు కార్యాలయంలో పనుల కోసం 40 శాతం కమీషన్ డిమాండ్ చేశారని ఆరోపించినట్లు జైరాం ప్రస్తావించారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డింగ్‌ను చంపత్ రాయ్‌కు వినిపించిన తర్వాత తననే ప్రాజెక్టు నుంచి తొలగించారని వర్మ చెప్పినట్లు మీడియా కథనాలను ఉటంకించారు. ఈ ఆరోపణలపై ట్రస్టు ప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని ప్రశ్నించారు.

కుల్గామ్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. కుల్గామ్ జిల్లాలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) శిబిరం సమీపంలోని చెక్‌పోస్టుపై బుధవారం దాడి చేశారు. మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిని వెంటనే అనంతనాగ్ జిల్లాలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మధ్యాహ్నం 2.15 గంటలకు కాల్పులు

అధికారుల వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం సుమారు 2.15 గంటల సమయంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కుల్గామ్‌లోని సీఆర్‌పీఎఫ్ నాకా వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై అకస్మాత్తుగా కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరపడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో 46వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

బిజినెస్

అంతెత్తున ఎగిసి ఆపై దిగి వచ్చి..

చివరికి లాభాలతోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. చమురు ధరల పతనం, ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు ఉదయం ఉరకలేశాయి. ఆ తర్వాత అమాంతం చతికిలపడ్డాయి. చివరకు కోలుకుని లాభాలతో ముగిశాయి. ఇవాళ్టి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 770 పాయింట్లకుపైగా లాభపడగా, నిఫ్టీ 25,200 మార్క్ పైన ముగిసింది. క్రితం సెషన్ ముగింపు (81,106.65) తో పోలిస్తే ఈ ఉదయం సెన్సెక్స్ దాదాపు 1100 పాయింట్ల లాభంతో 82,248.68 వద్ద ఉత్సాహంగా ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఒక దశలో 82,520 వద్ద ఎనిమిది నెలల గరిష్ఠస్థాయిని తాకింది. ఈ దశలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఐటీ, రియల్టీ షేర్లలో అమ్మకాలతో కుదేలైన సెన్సెక్స్.. 81,417 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. అంటే గరిష్ఠస్థాయి నుంచి దాదాపు 1000 పాయింట్లు తగ్గింది. చివరి సెషన్‌లో కోలుకున్న సూచీలు మార్కెట్ ముగిసే సమయానికి 772.75 పాయింట్లు పెరిగి 81,879 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 210 పాయింట్లు లాభపడి 25,255 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఎనిమిది పైసలు పెరిగి 93.69 గా స్థిరపడింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు సద్దుమణుగుతాయనే అంచనాలతో ముడిచమురు ధరలు దిగొచ్చాయి.

ఐపీవోకు 'హిందుస్తాన్ కోకకోలా'..

99.75 కోట్ల షేర్ల ఆఫర్



న్యూఢిల్లీ: గ్లోబల్ పానీయాల దిగ్గజం కోకకోలా కంపెనీ దేశీ బాట్లింగ్ బిజినెస్ హిందుస్తాన్ కోకకోలా హోల్డింగ్స్(హెచ్‌సీసీహెచ్) పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మా ర్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా విదేశీ ప్రమోటర్ కంపెనీ హిందుస్తాన్ కోకకోలా ఓవర్‌సీస్ హోల్డింగ్స్ పీటీఈ 99.75 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ చేయనుంది. వెరసి ఐపీవో నిధులు ప్రమోటర్లకు చేరనున్నాయి. దేశీ బాట్లింగ్ విభాగం హిందుస్తాన్ కోకకోలా బెవరేజెస్(హెచ్‌సీసీబీ)ను త్వరలో లిస్ట్ చేయనున్నట్లు మాతృ సంస్థ హెచ్‌సీసీహెచ్ ఈ ఏడాది జూన్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే.

అతిపెద్ద కంపెనీగా..

ఆదాయంరీత్యా 2025--26లో నాన్‌ఆల్కహాలిక్ రెడీ టు డ్రింక్ పానీయాల విభాగంలో హెచ్‌సీసీహెచ్ దేశీయంగా అతిపెద్ద కంపెనీగా నిలిచినట్లు టీకేసీ నివేదిక పేర్కొంది. దేశీ కోకకోలా వ్యవస్థలో అతిపెద్ద బాట్లర్‌గానూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేసింది. కంపెనీ కోక కోలాకు చెందిన విభిన్న పానీయాల ప్యాకేజింగ్, పంపిణీ, విక్రయాలను చేపడుతోంది. కోకకోలా ఓవర్‌సీస్ ద్వారా హెచ్‌సీసీహెచ్‌లో విదేశీ మాతృ సంస్థ కోకకోలా కంపెనీ 60 శాతం వాటాను కలిగి ఉంది.

బ్యాటరీ వ్యర్థాల ఎగుమతులపై నిషేధం



దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి నిల్వ వ్యవస్థల వినియోగం వేగంగా పెరుగుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ముందస్తు వర్గీకరణ చేయని (అన్‌సార్టెడ్) బ్యాటరీ వ్యర్థాలు, లిథియం-అయాన్ బ్యాటరీ బ్లాక్ మాస్ ఎగుమతులను తక్షణమే నిషేధిస్తూ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) అధికారిక ప్రకటన జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ నిషేధం అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది.

మారిన ఎగుమతి విధానం

గతంలో ఐటీసీ (హెచ్‌ఎస్) కోడ్ కింద ఉన్న ప్రాథమిక సెల్స్, ప్రైమరీ బ్యాటరీలు, ఎలక్ట్రిక్ అక్యుములేటర్లు అలాగే వినియోగించిన బ్యాటరీల వ్యర్థాల ఎగుమతి విధానం 'స్వేచ్ఛ'(ఫ్రీ) జాబితాలో ఉండేది. అయితే, ఎలాంటి సీసం (లెడ్), కాడ్మియం లేదా పాదరసం లేని, వర్గీకరించని బ్యాటరీ స్క్రాప్, లిథియం-అయాన్ బ్యాటరీ బ్లాక్ మాస్‌ను ఇప్పుడు నిషేధిత జాబితాలోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల దేశీయ ఎగుమతిదారులు ఇకపై ఈ నిర్దిష్ట వ్యర్థాలను విదేశాలకు తరలించడానికి వీలు ఉండదు.

ఈ నిర్ణయం వెనుక కారణం

లిథియం-అయాన్ బ్యాటరీల రీసైక్లింగ్ ద్వారా లభించే బ్లాక్ మాస్‌లో లిథియం, కోబాల్ట్, నికెల్, మాంగనీస్ వంటి విలువైన ఖనిజాలు ఉంటాయి. సరిగ్గా ఇటువంటి కీలక ఖనిజాల సంపద దేశం దాటిపోకుండా అడ్డుకోవడమే ఈ నిషేధం ప్రధాన ఉద్దేశం. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇది పెద్దపీట వేస్తుంది. దేశంలో తయారయ్యే లేదా సేకరించే బ్యాటరీ వ్యర్థాలు ఇక్కడి రీసైక్లింగ్ యూనిట్లకే అందేలా చూడటం ద్వారా సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

వ్యాపారం పెరిగినా లేఆఫ్‌లే..
1,000 ఉద్యోగాలపై కోతవేసిన పెప్సీకో



ఇంటర్నెట్‌డెస్క్: శీతలపానీయ దిగ్గజ సంస్థ పెప్సీకో తాజాగా 1,000 ఉద్యోగాలను తగ్గించుకోవాలని నిర్ణయించింది. తన ఉత్తర అమెరికా వ్యాపార కార్యకలాపాలను క్రమబద్ధీకరించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు కంపెనీ చెబుతోంది. వాస్తవానికి ఈ సంస్థ ఐరోపా, మధ్య ఆఫ్రికా వ్యాపారం ఈ త్రైమాసికంలో 5.41 బిలియన్ డాలర్లు వృద్ధి చెందినా.. ఈ నిర్ణయం తీసుకొంది. వ్యాపార అభివృద్ధి, ఆపరేషనల్ సామర్థ్యం పెంపొందించడానికి ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. పెప్సీకోలో ఇలియాట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ 2025లో వాటాలు కొనుగోలు చేసిన తర్వాత పునర్‌వ్యవస్థీకరణ వేగవంతమైంది.

క్వాల్‌కామ్‌లో చర్యలు మొదలు

ఇప్పటికే ఉద్యోగులకు లేఆఫ్‌లు ఉంటాయని అక్టోబర్‌లో ప్రకటించిన క్వాల్‌కామ్ సంస్థ ఆ దిశగా చర్యలు చేపట్టింది. దీంతో ప్రపంచంలోని వివిధ దేశాల్లోని ఆ సంస్థ ఉద్యోగులు ప్రభావితం కానున్నారు. దీనికి సంబంధించి వీడ్కోలు ప్యాకేజీని ప్రకటించింది. మొదట దీనికి అంగీకరించి.. ఎగ్జిట్ పత్రాలపై సంతకం చేసిన ఉద్యోగులు అదనపు మొత్తం అందుకొంటారని వెల్లడించింది. ఇక ప్రకటించిన ప్యాకేజీ ప్రకారం రెండువారాల స్థూల వేతనం, మిగిలిన సర్వీసులో ప్రతి ఏడాదికి రెండు వారాల అదనపు వేతనం, మిగిలిన సర్వీసుకు ముందుగా లెక్కగట్టిన పరిహారం, హెల్త్‌కవరేజీకి ఏకమొత్తంలో చెల్లింపులు వంటి అంశాలున్నాయి. ఈ సారి లేఆఫ్‌ల్లో ఎన్ని ఉద్యోగాలు ప్రభావితం అవుతాయో కచ్చితంగా వెల్లడించలేదు. తొలుత భారత్‌లో 1,000 ఉద్యోగాలపై ప్రభావం పడొచ్చని భావించినా.. ఇప్పుడు ఆ సంఖ్య తక్కువగానే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. క్వాల్‌కామ్‌కు ప్రపంచ వ్యాప్తంగా 52,000 మంది ఉద్యోగులున్నారు.

'శ్రేయస్.. నీ వెనక నేనున్నా'..
పంజాబ్‌కు మారిన తర్వాత హార్దిక్ ఫస్ట్ రియాక్షన్

ట్రేడ్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు మారిన హార్దిక్

కెప్టెన్, కోచ్, జట్టు, మొత్తం పంజాబ్‌కు అండగా ఉంటానని వ్యాఖ్య

తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో టీమ్‌కు మద్దతుగా ఉంటానని సంకేతం

అతడి స్థానంలో ముంబై ఇండియన్స్‌లో చేరనున్న అర్ష్‌దీప్



ఐపీఎల్‌లో కీలక ఆటగాళ్ల ట్రేడింగ్ వ్యవహారం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి మారనున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బలమైన సందేశం పంపించాడు. కెప్టెన్ శ్రేయస్, కోచ్ రికీ పాంటింగ్ సహా పంజాబ్ జట్టు మొత్తానికి తాను అండగా ఉంటానని స్పష్టం చేశాడు. పంజాబ్ జెర్సీతో ఉన్న ఫొటోను కూడా పంచుకున్నాడు. రెండుసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేరిన పంజాబ్ కింగ్స్‌తో కలిసి పనిచేయడం పట్ల హార్దిక్ ఉత్సాహం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ.. నా జట్టు.. పంజాబ్ మొత్తం.. మీ వెనక నేనున్నా' అంటూ పోస్ట్ చేశాడు. తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో జట్టుకు ఉపయోగపడతాననే సంకేతాలిచ్చాడు. ఐపీఎల్ చరిత్రలోనే కీలకమైన ఆటగాళ్ల మార్పిడిలో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు హార్దిక్ వెళ్లనున్నాడు. అతడి స్థానంలో భారత టీ20 బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌లో చేరనున్నాడు. ఈ ట్రేడింగ్‌లో హార్దిక్ పారితోషికం రూ.16.35 కోట్ల నుంచి రూ.18 కోట్లకు పెరగనుంది. అర్ష్‌దీప్ మాత్రం తన ప్రస్తుత రూ.18 కోట్ల పారితోషికంతోనే ముంబై జట్టుకు మారనున్నాడు. హార్దిక్‌కు ముంబై ఇండియన్స్‌తో సుదీర్ఘ అనుబంధం ఉంది. 2015లో ఆ జట్టులో చేరిన అతడు 2015, 2017, 2019, 2020 సీజన్లలో ట్రైటిళ్లు గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఏడు సీజన్ల తర్వాత గుజరాత్ టైటాన్స్‌కు మారి, తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా టైటిల్ అందించాడు. 2023లోనూ ఆ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. 2024లో తిరిగి ముంబైకి వచ్చి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. మొత్తం 162 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో హార్దిక్ 2,955 పరుగులు చేయడంతోపాటు 82 వికెట్లు పడగొట్టాడు. అయితే ముంబైతో రెండో విడత మూడేళ్ల ప్రయాణంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. 39 మ్యాచ్‌ల్లో 647 పరుగులు, 29 వికెట్లు సాధించాడు. అతడి కెప్టెన్సీలో ముంబై 2025లో ప్లేఆఫ్స్‌కు చేరగా, 2024, 2026 సీజన్లలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. మరోవైపు అర్ష్‌దీప్ 2019లో పంజాబ్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఆ జట్టు తరఫున 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. 2025 సీజన్‌లో 21 వికెట్లు, 2026లో 14 వికెట్లు పడగొట్టాడు. కొత్త బంతితో వికెట్లు తీయడంతోపాటు డెత్ ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.

మ్యూజియానికి సచిన్ 26 బ్యాట్లు..
నవంబర్ 16న 'బ్యాటోగ్రఫీ'



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన కెరీర్‌లో ఉపయోగించిన 26 బ్యాట్లను ముంబై క్రికెట్ సంఘానికి (ఎంసీఏ) బహుమతిగా ఇవ్వనున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో చారిత్రక ఘనతలు సాధించేందుకు ఉపయోగించిన బ్యాట్లతో పాటు హెల్మెట్లు, జెర్సీలు, కీలక సందర్భాలకు సంబంధించిన వ్యక్తిగత నోట్లను కూడా ఎంసీఏకు అందించనున్నారు. వీటిని ముంబైలోని శరద్ పవార్ క్రికెట్ మ్యూజియంలో ప్రత్యేక విభాగంలో ప్రదర్శించనున్నారు. 'బ్యాటోగ్రఫీ' పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రదర్శనను నవంబర్ 16న ప్రారంభించనున్నారు. సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి 13 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రదర్శనను ప్రారంభించడం విశేషం. 2013 నవంబర్‌లో ముంబై వాంఖడే స్టేడియంలో వెస్టిండీస్‌తో తన 200వ టెస్టు ఆడిన సచిన్.. అదే మ్యాచ్‌తో అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికారు. సచిన్ క్రికెట్ ప్రయాణాన్ని ఆయన ఉపయోగించిన బ్యాట్ల ద్వారా పరిచయం చేయడమే 'బ్యాటోగ్రఫీ' ఉద్దేశం. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు సాధించిన చారిత్రక ఘనతకు తోడ్పడిన బ్యాట్లు కూడా ఇందులో ఉండనున్నాయి. వాటి వెనుక ఉన్న విశేషాలను తెలుసుకునే అవకాశం అభిమానులకు లభించనుంది. ఈ కార్యక్రమంపై ఎంసీఏ అధ్యక్షుడు అజింక్య నాయక్ మాట్లాడుతూ.. భారత, ప్రపంచ క్రికెట్‌కు సచిన్ అందించిన సేవలు రికార్డులకు మాత్రమే పరిమితం కావని అన్నారు. కోట్లాది మంది అభిమానుల జ్ఞాపకాల్లో ఆయన ప్రయాణం భాగమైందని పేర్కొన్నారు. సచిన్ తన విలువైన జ్ఞాపికలను మ్యూజియానికి అందించడం గౌరవంగా భావిస్తున్నామని, తద్వారా భవిష్యత్ తరాల క్రికెట్ అభిమానులు ఆయన ఘనతలను మరింత దగ్గరగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక ప్రదర్శన ద్వారా సచిన్ కెరీర్‌లోని కీలక ఘట్టాలను, వాటితో ముడిపడిన జ్ఞాపకాలను భద్రపరచడంతో పాటు అభిమానులకు వాటిని ప్రత్యక్షంగా చూసే అవకాశం కలగనుంది.

స్పోర్ట్స్

పురుష క్రికెటర్లతో సమానంగా మమ్మల్నీ గుర్తించండి:
పాక్ కెప్టెన్ ఫాతిమా సనా

పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్ కు ఆదరణ దక్కాలన్న ఫాతిమా సనా

డబ్ల్యూబీబీఎల్‌లో పెర్త్ స్కార్చర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సనా

ఈ లీగ్‌లో ఆడుతున్న రెండో పాకిస్థాన్ మహిళా క్రికెటర్

2028 టీ20 వరల్డ్ కప్‌తో పెను మార్పులు భాయమన్న ఆశాభావం

మెగా టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న పాక్



పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్‌కు కూడా గుర్తింపు, ఆదరణ దక్కాలని ఆ దేశ మహిళల జట్టు కెప్టెన్ ఫాతిమా సనా ఆకాంక్షను వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ (బిదీదీూ)లో పెర్త్ స్కార్చర్స్ జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫాతిమా సనా మాట్లాడుతూ, మహిళల క్రికెట్‌లో సమగ్ర మార్పు రావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు స్టేడియాలు కిక్కిరిసిపోవడం, మీడియా నుంచి విపరీతమైన ప్రచారం లభించడం సర్వసాధారణమని, సరిగ్గా అలాంటి వాతావరణం, ఉత్సాహం మహిళల మ్యాచ్‌లకు కూడా దక్కాలన్నదే తన ప్రధాన లక్ష్యమని ఫాతిమా సనా పేర్కొంది. మైదానంలో మహిళా క్రికెటర్లు సైతం పూర్తి స్థాయిలో శ్రమిస్తున్నారని, వారికి కూడా సమాన స్థాయిలో అభిమానుల మద్దతు అవసరమని ఆమె అభిప్రాయపడింది. ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లో కేవలం 15 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం సాధించి ప్రపంచ రికార్డు సృష్టించిన ఫాతిమా సనా, మహిళల బిగ్ బాష్ లీగ్‌లో అడుగుపెట్టిన రెండో పాకిస్థానీ క్రీడాకారిణిగా నిలిచింది. గతంలో 2019లో నిదా దార్ ఈ లీగ్‌లో ఆడగా, మళ్లీ ఇన్నాళ్లకు ఫాతిమాకు ఈ అవకాశం లభించింది. డబ్ల్యూబీబీఎల్ వంటి నాణ్యమైన అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయని, తన అనుభవం భవిష్యత్తులో మరింత మంది పాకిస్థానీ అమ్మాయిలు విదేశీ లీగ్‌లకు ఎంపికయ్యేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. మరోవైపు, 2028లో జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్‌కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుండటంపై ఫాతిమా సనా స్పందిస్తూ.. ఈ మెగా ఈవెంట్ దేశంలో మహిళల క్రీడారంగానికి ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుందని చెప్పింది. సొంత గడ్డపై ప్రపంచకప్ నిర్వహించడం ద్వారా స్థానిక బాలికల్లో క్రికెట్ పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని, మహిళల క్రికెట్‌ను చూసే దృక్పథంలోనూ స్పష్టమైన మార్పు వస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. క్రీడారంగంలో లింగ సమానత్వం దిశగా అడుగులు పడటానికి ఇలాంటి భారీ టోర్నీలు దోహదపడతాయని ఫాతిమా సనా స్పష్టం చేసింది.